


# పరదేశీ కథలు

– చిట్టే సిద్ధ లలిత



-82-

## ఒక రాణి కథ

*దాహం దాహం* అని మూలుగుతున్న ఆమె వైపు నీరులేని ఎడారి నేల నిస్సహాయంగా చూసింది. అక్కడక్కడా విసిరేసినట్లున్న ఎడారి తుప్పలు ఎండకు వడలిపోతున్న ఆమె దేహానికి నీడనివ్వలేక పోతున్నందుకు చింతించాయి. గుట్టలుగా పేరుకున్న ఇసుక తెరలుతెరలుగా పైకి లేచి కళ్ళను కప్పేస్తోంది. కళ్ళు తెరిచి చూడలేని స్థితి. ఎండిన పెదాలలోనుండి మాట బయటికి రాని పరిస్థితి. బిగ్గరగా కేకలు వేస్తున్నానని ఎవరో వచ్చి రక్షిస్తారని ఆమె అనుకుంటోంది. కానీ అప్పటికే దేహంలో శక్తి నశించిపోవడంతో నోట్లోనుండి శబ్దం బయటికి రావడం లేదు.

అంతులేని బాధను భరించలేక మూలుగుతున్నట్లుంది. అర్థంకాని వేదనతో పలవరిస్తున్నట్లుంది. జాలిలేని సూర్యుడు ఆకాశంలోనుండి నిప్పులు కురిపిస్తున్నాడు. అంతేకాదు తోడుగా రాబందులు కూడా రెక్కలు విప్పుకుని అదను కోసం ఎదురు చూస్తూ ఆకాశంలో గిరికీలు కొడుతున్నాయి. నిమిష నిమిషానికీ నిస్సత్తువ ఆవహిస్తోంది. శక్తి సన్నగిల్లుతోంది. ప్రాణం అల్లాడిపోతోంది. శరీరం సొమ్మసిల్లిపోతోంది. ఇంకొన్ని నిమిషాల్లో ఆకాశపక్షులకు, ఎడారి జీవులకు ఆహారంగా మారనుందా. చలనం ఆగిన దేహాన్ని పంచుకుని విందు భోజనంలా ఆరగిస్తాయేమో. పోనీలే ఈ ప్రపంచానికి తన అవసరం లేదు. కాకులకు గద్దలకు ఆకలి తీర్చగలిగితే అంతే చాలు. ఆఖరి క్షణాలను లెక్కబెడుతూ ఎడారి నేలపై అలా పడివుందామె.

ఓ ఎడారీ ఎందుకంత కక్ష. ఓ సూర్యుడా ఏమిటా కోపం. ఓ జీవితమా తప్పేమీ లేకపోయినా ఎందుకిలా బాధిస్తున్నావు. ఎందుకీ శిక్ష. అసలేమయింది. జరిగిన దానిలో తన పొరపాటు వుందా. తనలో తాను తర్కించుకుంటోందామె.

"హేయ్ రాణీ లేచి మొహానికి పౌడర్ కాస్త పూసుకుని బయటకొచ్చి వరసలో నిలబడు. ఈ రోజు కువైట్ షేకా వస్తోంది. ప్యాలెస్ లో పని చెయ్యడానికి పదిమంది కద్దామాలు కావాలట. నీ అదృష్టం బావుండి ఆమెకు నచ్చితే నీ పంట పండినట్లే. ఈ షేఖా కువైట్ లో చాలా ఆస్తులు వున్న సంపన్నురాలు.

మామూలు ఇండ్లలో ఎన్నేళ్ళు చేసినా ఏం లాభంలేదు. షేకుల భవనాల్లో నాలుగేళ్ళు పనిచేసినా లక్షలు సంపాదించవచ్చు కదా" మెరిసే కళ్ళతో చెప్పింది ఏజెంటు లక్ష్మి. "అలాగే మేడం ముఖం కడుక్కొస్తా" అంటూ బాత్ రూంలోకి పోయింది రాణి.

కాస్త పౌడర్ రాసుకుని బయటికి వచ్చేటప్పటికే కద్దామాలందరూ తయారైపోయి వరసలో నిలబడి వున్నారు. రకరకాల డ్రస్సులతో మేకప్పులతో అపుడే సర్కస్ నుండి పారిపోయి వచ్చిన బఫూన్లలా వున్నారు వాళ్ళు. సెంటు వాసనలతో ఆ ప్రదేశం గుప్పుమంటోంది.

"అబ్బా మీరందరూ రోజూ స్నానం చెయ్యరా ఏమి. మొత్తం సెంటు బాటిళ్ళన్ని వంటిపై వంపుకున్నారు. ఇన్ని వాసనలు ఒకేచోట భరించలేకున్నాం. పొట్టకోస్తే అక్షరం ముక్క రాదు కానీ ముఖానికి ఫుల్లు మేకప్పు, పెదాలకు నిండా లిప్సిటిక్ వేసుకుని కువైట్ వాళ్ళనే మించిపోయేలా తయారయ్యారు మీరు. అతి ఎప్పుడూ అనర్థమే తెలుసా.

షేఖా చూస్తే వీళ్ళు పనిచేసుకోవడానికి వచ్చారా అందాల పోటీలకు వచ్చారా అనుకుంటుంది. ఇలా ఎక్కువ చేస్తే షేఖాలు ఊరికే వుంటారా. గుండు కొట్టించి మగాడి ముందుకు పోకుండా నిండా బురఖా వేసేస్తారు" అంటూ ముక్కు మూసుకుంది ఏజంటు లక్ష్మి.

ఇంతలో రాణి వచ్చి ఓ వైపు నిలబడింది.

"నువ్వు నాచురల్ బ్యూటీవి. అందంలో ఈ కువైట్ వాళ్ళనే మించిపోతావు. షేఖా నిన్నే తీసుకుపోతుంది చూడు" అంది ఏజంటు లక్ష్మి రాణి వైపు చూస్తూ.

బదులుగా చిన్నగా నవ్వింది రాణి. బుగ్గలు సొట్టలు పడటంతో ఆమె నవ్వు అందరి చూపులనూ ఆకర్షించింది.

పొద్దున వస్తుందనుకున్న షేఖా తీరికగా మధ్యాహ్నానికి వచ్చింది.

ఆమె కంట పడాలని కద్దామాలందరూ పోటీపడి ముందుకు వచ్చి నిలబడ్డారు. వున్న 20 మందిలో ఐదుగురిని మాత్రమే ఇష్టపడింది షేఖా.

అందులో రాణి వుంది.

ఏజంటు అడిగిన దినారాలు చెల్లించి ఐదుమంది కద్దామాలను తనుండే ప్యాలస్ కు తీసుకుపోయింది షేఖా.

వారిలో అందంగా హుషారుగా కనబడే ఇద్దరిని మాత్రం తన పరిచర్యల కోసం వుంచుకుని మిగతా ముగ్గురినీ వంట ఇంట్లోకి పంపేసింది. అదృష్టమో దురదృష్టమో ఈ ఇద్దరిలో రాణి వుంది.

దాదాపూ వందమంది పనివాళ్ళుండే అందమైన భవనమది. షేఖాకు నలుగురు కొడుకులు. ఇద్దరు కొడుకులు చదువులు పూర్తి చేసి షేఖాకున్న వ్యాపారాలను చూసుకుంటున్నారు. ఇద్దరు ఇంకా అమెరికాలో వుండి చదువుతున్నారు. షేఖా రాణికి చెయ్యాల్సిన పనులూ చెయ్యకూడని పనులన్నీ వివరించింది.

అరబ్బీ భాష ఇంకా రాకపోయినప్పటికీ ఒక్కసారి చెప్తే అర్థం చేసుకుని అల్లుకుపోయే సునిశితదృష్టిగల రాణి కొద్ది రోజుల్లోనే షేఖాకు ఇష్టసఖి అయింది. షేఖా ఇష్టాఇష్టాలు గ్రహించి అడిగినవి సమయానికి అందిస్తూ ఆమె అభిమానాన్ని చూరగొంది. షేఖా ఎక్కడికి వెళ్ళినా రాణి తోడుగా వుండాల్సిందే. షేఖా భర్త ఖలీల్ కు నలుగురు భార్యలు. ఆ నలుగురికీ పుట్టిన సంతానం పదహారుమంది. అందుకే ఆయన ఎప్పుడూ బయటే తిరుగుతూ వుండేవాడు. ఎప్పుడు ఎవరి ఇంట్లో వుంటాడో ఎవరికీ తెలియదు.

ఇస్లాం మతం నలుగురు స్త్రీలను పెళ్ళి చేసుకోవడానికి పురుషునికి అనుమతిని ఇచ్చింది. అందుకే ఆయన నలుగురిని చేసుకున్నాడు. వీలయినంతమంది పిల్లల్ని కని కుటుంబాలను విస్తరింపజేయడం పురుషుని కర్తవ్యం. కనడం స్త్రీ ధర్మం. ఇందులో తప్పేం వుంది అంటుంది షేఖా.

ఇస్లాం మత సిద్ధాంతాలను, చట్టాన్ని, భర్తను గౌరవించడం స్త్రీగా తన విధి అని గట్టిగా నమ్ముతుంది షేఖా. షేఖా మాటలను విని ఆమె గుండె నిబ్బరాన్ని చూసి ఆశ్చర్యపోయింది రాణి.

రాణికి పెద్దగా పని వుండేది కాదు. షేఖా బట్టలు, నగలు అల్మరాల్లో అమర్చడం షేఖా అడిగినవి అందించడం లాంటి చిన్న చిన్న పనులే వుండేవి. కువైట్ లోని అరేబియా సముద్రపు ఒడ్డున వుంటుంది షేఖా విలాసమైన భవంతి. అక్కడ కోరిన తిండి నచ్చిన బట్ట దొరకడంతో రాణి అందం ఇనుమడించింది. ఆమె సౌందర్యం చిగురాకులా మిసమిసలాడింది.

ఆ రోజు షేఖా పుట్టినరోజు. భర్తను, మిగిలిన ముగ్గురు భార్యలను వారి పిల్లలను, స్నేహితులను ఆహ్వానించింది షేఖా. ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఆరోజు షేఖా వేసుకునే డ్రస్, ఆభరణాలు ప్రత్యేకంగా లండన్ నుండి తెప్పించారు. అందరిలోనూ ప్రత్యేకంగా కనబడాలని తగిన శ్రద్ధ తీసుకుంది షేఖా. ఆ పనులన్నీ క్రమంగా జరిగించమని రాణికి అప్పగించింది.

వంటవాళ్ళు హడావిడి పడుతున్నారు. డ్రైవర్లు సామాన్లు తేవడంలో బిజీ అయ్యారు. పనివాళ్ళు గదులు శుభ్రం చెయ్యడం, కార్పెట్లు, కిటికీ కర్టెన్లు, సోఫా ముసుగులు మార్చడంలో బిజీ అయ్యారు.

ప్యాలెస్ లో పండగ వాతావరణం నెలకొంది. అందరూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఆప్తులు ఆలింగనం చేసుకుని బహుమతులను అందజేస్తున్నారు. షేఖ్ ఆడంబరంగా ఆడీ కార్ లో దిగాడు. ఆయన వచ్చే దారంతా ఎర్ర తివాచీని పరిచారు. పూలు చల్లుతూ షేఖాకు స్వాగతం పలికారు.

ఆయన వస్తూనే షేఖాను ముద్దు పెట్టుకుని మార్కెట్ లోకి కొత్తగా వచ్చిన కారును షేఖాకు బహూకరించారు.

షేఖా పొంగిపోయింది. పనివాళ్ళందరికీ ఒక నెల అదనపు జీతాలను ప్రకటించింది.

అరబ్ ఎడారి నేలలో పెట్రోలు పెల్లుబికినట్లు అంతటా సందడి, సంబరం, సంతోషం వెల్లి విరుస్తోంది.

పని లేకపోయినా అటు ఇటూ తిరుగుతూ హడావిడి చేస్తున్నారు పనివాళ్ళు. రాణికి మంచి డ్రస్ ను ఇచ్చి వేసుకోమంది షేఖా. అందమైన ఆ గౌనులో షేఖాను తలదన్నేలా మెరిసిపోతోంది రాణి.

ఎత్తుకు తగిన శరీర సౌష్టవం, తెల్లటి మేని ఛాయ, తీర్చిదిద్దినట్లున్న ముక్కూ నోరూ, విల్లులా వంగిన కనుబొమలూ, మీనాల్లా మెరిసే కళ్ళు, వత్తయిన నల్లటిజుట్టు రాణి స్వంతం. పురుషులనే కాదు స్త్రీల చూపులను కూడా కట్టిపడేసే అందగత్తె రాణి.

వచ్చిన ఆహ్వానితులందరూ రాణి వైపే అబ్బురంగా చూస్తూ షేఖా ఈ కద్దామా ఎక్కడ దొరికింది. అరబ్ అందగత్తెలనే మించిపోయింది అంటూ ఆరాలు తీస్తున్నారు.

"ముందే ఆడోళ్ళ పిచ్చి షేఖ్ కు. అందగత్తె అయిన ఈ రాణిని చూస్తే వదులుతాడా" అంటూ ఒకావిడ పక్కనావిడతో గుసగుసలాడుతోంది.

అన్నట్లుగానే షేఖ్ చూపు రాణి మీద పడింది.

పురుషులు అందమైన స్త్రీని అనుభవించడమే జన్మకు సార్ధకత అని భావించే సంస్కృతి అది.

స్త్రీ అందాన్ని ఆస్వాదించడం, అనుభవించడం పురుషుని జన్మహక్కు అని భావిస్తారు.

దానికి తోడు ఇస్లాంమతం నలుగురిని పెళ్ళి చేసుకునే వెసులుబాటును పురుషునికి కల్పించింది.

షేఖ్ దృష్టి రాణి మీద పడింది. కళ్ళు మెరిసాయి.

"తాలె హిందీ.." పిలిచాడు షేఖ్.

దగ్గరికి వచ్చి నిలబడింది రాణి.

చిరునవ్వుతో పైనుండి కిందకు పరికించి చూస్తూ "సును ఇస్మె (ఏం పేరు)" అని అడిగాడు షేఖ్

"నా పేరు రాణి" తడబడుతూ బదులిచ్చింది రాణి.

"రాణి అంటే అర్థం ఏమిటో చెప్పు" కప్పులోని అరబిక్ గహ్వాను చప్పరిస్తూ అడిగాడు.

"క్వీన్ అని అర్థం షేఖ్" చెప్పింది వినయంగా.

"ఓహో నువ్వు రాణివన్న మాట. గుడ్. ఒక్క చూపుతో మగాడిని వశపరచుకునే అద్భుతమైన అందం నీది. నన్ను పెళ్ళి చేసుకుంటావా. నిన్ను నిజంగా రాణిని చేస్తాను" అంతమందిలో ప్రతిపాదించాడు షేఖ్.

నిర్ఘాంతపోయింది రాణి.

రాణే కాదు అక్కడ వున్న వాళ్ళందరూ కాసేపు చలనం మరిచిపోయారు. వింటున్న షేఖాతో పాటూ మిగిలిన భార్యల కళ్ళు కోపంతో జేవురించాయి. షేఖ్ ఎంత మొండివాడో అనుకున్నది ఏదైనాసరే ఎలా సాధిస్తాడో వాళ్ళకు బాగా తెలుసు. పనిమనిషిని పెళ్ళి చేసుకుంటాడా.

తమలో ఒకరికి విడాకులు ఇస్తే గానీ మరో స్త్రీని పెళ్ళి చేసుకోలేడు షేఖ్. చట్టప్రకారం నలుగురు భార్యలే వుండాలి. మరి తమలో ఎవరికి విడాకులు ఇస్తున్నాడో. ఇక్కడ విడాకులెంతసేపు తలాక్ తలాక్ అని మూడుసార్లు చెప్పేస్తే చాలు. కలవరపడుతూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

షేఖ్ కు ఇదేమీ పట్టలేదు. పక్కనున్న ప్రపంచాన్నే మరిచిపోయి, మైమరచిపోయి రాణినే కళ్ళార్పకుండా చూస్తున్నాడు. గుచ్చుకునే చూపులను తట్టుకోలేక అసహనంగా కదిలింది రాణి.

ముందుగా తేరుకున్న షేఖా "రాణీ నువ్వు గదిలోకి వెళ్ళు" అని అరిచింది. అక్కడినుండి పరిగెత్తి పారిపోయింది రాణి.

ఎలాగో పుట్టినరోజు వేడుకను జరిపించేసారు. విందు ముగియగానే వచ్చిన వాళ్ళందరూ సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. రాణి మీదే మనసు నిలవడంతో షేఖా ఆ రాత్రికి అక్కడే వుండిపోయాడు.

పొమ్మని చెప్పలేక పోయింది షేఖా. ఆ రాత్రంతా నిద్రపోలేదు షేఖ్. ఒక్కసారైనా రాణితో గడిపే అవకాశాన్ని అందించమని షేఖాను అడుగుతూ ప్రాధేయపడ్డాడు షేఖ్. కామం కళ్ళకు పొరలను కమ్మేలా చేస్తుంది.

ఏం చెయ్యాలో అర్థంకాక తలపట్టుకుంది షేఖ.

ఉదయాన్నే షేఖా నిద్ర లేవగానే ముగ్గురు సవతులు వరసగా ఫోన్ కాల్స్ చేసి ఏమయింది అనీ అడిగారు.

"ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు" అంది షేఖా.

సరే నేనొస్తున్నాను. రాణిని నా ఇంటికి తీసుకుపోయి షేఖ్ కి తెలియకుండా దాన్ని అక్కడ దాచిపెడతాను. షేఖ్ అడిగితే నీకు తెలియదని చెప్పు చెప్పింది మూడో భార్య నజాతి.

ఈ సమస్యనుండి గట్టెక్కాలనుకుంది షేఖా. షేఖ్ నిద్ర లేవకముందే రాణిని నజాతితో పంపేసింది.

కానీ సమస్య అంత సులభంగా పరిష్కరింపబడలేదు.

నిద్ర లేచాక షేఖ్ రాణి కోసం వెదకనారంభించాడు. షేఖా కు ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఇక దిక్కుతోచక రాణి రాత్రే ఇంటినుండి పారిపోయింది అంటూ అబద్దం చెప్పేసింది.

షేఖ్ తెలివైనవాడు. పట్టిన పట్టు విడవడు. లేదు నువ్వే ఎక్కడో దాచేసావ్. నిజం చెప్పు అని రెట్టించాడు. భార్యల ఇళ్ళన్నీ వెదకడానికి బయల్దేరాడు.

ఇదెక్కడ ఖర్మో అర్థం కాలేదు షేఖాకు. వెంటనే మూడో భార్యకు ఫోన్ చేసి షేఖ్ రాణిని వెదకడానికి వస్తున్నట్లు చెప్పింది. రాణిని అక్కడనుండి ఎక్కడికైనా పంపించమంది.

మూడోభార్య షేఖా అంత దయగలది కాదు. పళ్ళు కొరికింది. రాణిని కార్లో కూర్చోమని చెప్పి పట్టణం అవతలికి తీసుకుపోయింది.  అంతా ఎడారి. కంటికెదురుగా ఇసుక తప్ప ఏమీ కనబడలేదు. కాసేపు అక్కడ వుంటే ఇసుక తుఫానులు మనిషిని కప్పేస్తాయి. తరువాత ఆనవాళ్ళు కూడా చిక్కవు. రాణిని అక్కడ దించేసి వెనుదిరిగి వెళ్ళిపోయిందామె.

ఏం జరుగుతోందో రాణి కి అర్థం కాలేదు. కాసేపటికే ఎడారి ఎండ వంటిని శూలాల్లా గుచ్చనారంభించింది. అసహాయంగా ఏదో ఆశతో వెనక్కి తిరిగి అడుగులు వేయనారంభించింది. అడుగులు కూరుకుపోయే ఆ ఇసుకలో ఎంతసేపని నడవగలదు. కనీసం రోడ్డు దగ్గరికైనా చేరుకోవాలని ఆమె ప్రయాస పడింది. కానీ ఎడారిలో ఏ వైపు ఏముందో ఏ దిక్కు ఎక్కడో ఏం తెలుస్తుంది.

నడిచి నడిచి ఓపిక సన్నగిల్లి ఒకచోట నేలకు ఒరిగిపోయింది రాణి. చెప్పులెక్కడ పడిపోయాయో తెలియదు. వేడికి కాళ్ళు బొబ్బలెక్కాయి. తన తప్పు ఏమీ లేకపోయినా ఈ శిక్ష ఎందుకో అర్థం కాలేదు రాణికి. ఎడారిలో చిక్కుకుపోవడమనేది అత్యంత హేయమైన పరిస్థితి. ఆ శిక్ష శత్రువుకు కూడా వేయకూడదు.

బ్రతుకు అర్థాంతరంగా ఈ ఎడారిలో ముగిసిపోతోంది. ఎడారి వేడికి ప్రాణం ఆవిరైపోతోంది. వంట్లోని రక్తం ఒక్కో చుక్కా ఆవిరై పోతోంది. అయిపోయింది తనపని. కళ్ళు మూసుకుని ఇక దేవుని ప్రార్థించడమే మిగిలింది. స్పృహ తప్పింది రాణికి.

ఎన్నోరోజుల తరువాత భారంగా కళ్ళు తెరిచింది రాణి. ఎదురుగా షేఖా పెద్ద కొడుకు అబ్దుల్లా నిలబడి వున్నాడు. ఇది కలా నిజమా తనెక్కడ వుందో అర్థం కాలేదు. "కంగారు పడకు రాణీ. అల్లా దయవలన నువ్వు బ్రతికావు. ఇక నీకేమీ కాదు. నీకు నేనున్నాను" చేయి వేసి భరోసానిచ్చాడు అబ్దుల్లా. నమ్మలేక బేలగా చూసింది రాణి. "మా అమ్మ నిన్ను మా ఇంట్లోకి తీసుకొచ్చినప్పటినుండీ నువ్వంటే నాకిష్టం కలిగింది. కానీ ధైర్యం చేసి నా ప్రేమను నీకు చెప్పలేకపోయాను.

మౌనంగా నాలో నేనే నీ ప్రేమకై తపించిపోయే వాడిని. నిన్ను ప్రతి రోజూ గమనించేవాడిని.నా తండ్రి నిన్ను వాంఛించడం మా సవతి తల్లి నిన్ను ఎడారిలో వదలడం నాకు తెలుసు. నిన్ను అనుసరిస్తూ వచ్చి ఆఖరి క్షణంలో అతికష్టం మీద నిన్ను కనుక్కుని నీ ప్రాణాన్ని కాపాడగలిగాను. ఆ ఎడారి ప్రాంతం నుండి నిన్నుతెచ్చి ఈ హాస్పిటల్లో చేర్చాక డాక్టర్లు నీ పరిస్థితి చూసి నీ ఆరోగ్యం చాలా విషమంగా వుందని చెప్పారు. కొద్ది రోజులు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమని అన్నారు. నాకు భయమేసింది. దాదాపూ రెండు నెలలు కోమాలో వున్న నువ్వు ఈరోజు కళ్ళు తెరిచావు. అల్లా నీతోడుగా వుండి నిన్ను రక్షించాడు." చెమ్మగిల్లిన కనులతో జరిగినదంతా చెప్పుకొచ్చాడు అబ్దుల్లా.

తనపట్ల అతనికున్న ప్రేమకు చలించిపోయింది రాణి. "నీకు సమ్మతమైతే నువ్వు కోలుకున్నాక నిన్ను పెళ్ళి చేసుకుంటాను, నీ మీద ఎవరి కన్నూ పడకుండా కాపాడుకుంటాను రాణీ," చిరునవ్వుతో చెప్పాడు అబ్దుల్లా. తన అదృష్టాన్ని నమ్మలేకపోయింది రాణి. చంద్రునిలాంటి అతని మోమును చూస్తూ తన ప్రాణాల్ని రక్షించిన అబ్దుల్లాకు కృతజ్ఞతతో చేతులెత్తి నమస్కరించింది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments